- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

గురువారం
23-04-2026

సంపుటి : 01 సంచిక :32 పేజీలు : 08 వెల : ₹5/-

తెలుగు దినపత్రిక

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE :32 NAMASTEY MAHAAPRABHA

# ప్రభుత్వానికి చెంపపెట్టు

## అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక



- కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది
- రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్

హైదరాబాద్ ఏప్రిల్ 22 (మహాప్రభ)

కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. -మిగతా 3 లో

## బ్రాండ్ ఆధారంగా ప్రాధాన్యత

- మూడు కేటగిరీలుగా విభజించండి
- పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్ 22 (మహాప్రభ)

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్న పరిశ్రమలు, సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వాటిలో పేరున్న బ్రాండ్ సంస్థలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న అన్ని సంస్థలనూ అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలనీ, వారితో తరచుగా మాట్లాడు తూ అనుమతులు, భూ కేటాయింపుల అంశాల్లో అవసరమైన ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. బుధవారం సీఎం నివాసంలో పరిశ్రమలశాఖపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డితో పాటు పరిశ్రమల శాఖ ఉన్నతాధికా రులు పాల్గొన్నారు.

-మిగతా 3 లో

## కేసీఆర్, హరీశ్ రావులకు ఊరట

- ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలొద్దు
- సీబీఐ దర్యాప్తు కూడా చేయొద్దు
- కాళేశ్వరంపై హైకోర్టు కీలక తీర్పు



హైదరాబాద్ ఏప్రిల్ 22 (మహాప్రభ)

కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని తేల్చి చెప్పింది. అలాగే ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, -మిగతా 3 లో



## నేపాల్‌లో మళ్లీ నిరసనలు..

- బాలెన్ షా సర్కార్‌కు నెల రోజుల్లోనే నిరసనల సెగ
- అవినీతి ఆరోపణలతో హోం మంత్రి గురుంగ్ రాజీనామా

కాఠ్మాండూ ఏప్రిల్ 22 (మహాప్రభ)

భారీ మెజారిటీతో పదవి చేపట్టిన నేపాల్ ప్రధాని బాలెన్ షాకు నెల రోజుల్లోపే ప్రజలు, విద్యార్థుల నుంచి నిరసన సెగ తగిలింది. రాజధాని కాఠ్మాండూ సహా పలు నగరాల్లో విద్యార్థులు, రాజకీయ గ్రూపులు, సామాన్యులు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ విధానాలపై గత రెండు, మూడు రోజులుగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. భారత్ నుంచి కొనుగోలు చేసే రూ.100 పైబడిన వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ విధించడాన్ని సామాన్యులు తప్పు పడుతున్నారు. -మిగతా 3 లో

# కదలని చక్రాలు

## డిపోలకే పరిమితం అయిన బస్సులు


- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రగీ తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (మహాప్రభ)

చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. -మిగతా 3 లో




## తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు



3 లో



## లక్నోను చిత్తు చేసిన రాయల్స్..

- లక్నో లో వరుసగా ఏడో మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీ ఓటమి
- రాజస్థాన్ చేతిలో 40 పరుగుల తేడాతో చిత్తు
- డకౌట్ అయిన బదోని, పంత్, మార్‌క్రమ్

న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (మహాప్రభ)

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో వరుసగా రెండు ఓటముల తర్వాత రాజస్థాన్ రాయల్స్ కమ్ బ్యాక్ ఇచ్చింది. వరుసగా నాలుగు విజయాలతో టోర్నీని ఆరంభించిన రాజస్థాన్.. ఆ తర్వాత రెండు మ్యాచులలో ఓడింది. తాజాగా లక్నో సూపర్ జెయింట్స్‌పై గ్రాండ్ విక్టరీ సాధించి.. మళ్లీ విజయాల బాట పట్టింది. లక్నోలోని ఏకనా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచులో రాజస్థాన్ రాయల్స్.. లక్నో సూపర్ జెయింట్స్‌ను 40 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానానికి చేరింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 159/6 పరుగులు మాత్రమే చేసింది. టాస్ గెలిచి బౌలింగ్

-మిగతా 3 లో



## నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

- తమిళనాడు, బెంగాల్‌లో ఏర్పాట్లు పూర్తి
- భద్రత కట్టుదిట్టం
- మే 4న ఫలితాలు

న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (మహాప్రభ)

దేశంలో ఎంతో ఉత్కంఠను రేపుతున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు నేడు (గురువారం) జరగనున్నాయి. ఇందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ప్రజలు ఓటు హక్కు ద్వారా వివిధ పార్టీల అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు నేడు ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 294 నియోజకవర్గాలకు గానూ రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. అందులో మొదటి దశలో భాగంగా 152 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మిగతా 142 స్థానాలకు ఈనెల 29న పోలింగ్ జరగనున్నది. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం

-మిగతా 3 లో

## భవిష్యత్ ఇంధనం గ్రీన్ హైడ్రోజన్ !

- పారిశ్రామిక ఆధిపత్యం కోసం చైనా
- సబ్సిడీలిచ్చి డిమాండ్ పెంచుతున్న భారత్

న్యూఢిల్లీ, బీజింగ్ ఏప్రిల్ 22 (మహాప్రభ)

ఇక భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ (పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం -మిగతా 3లో




## కాల్పుల విరమణ పొడిగింపు

### చర్చలు ముగిసే వరకు అమలులో ఉంటుందన్న ట్రంప్

- ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం కొనసాగుతుందని స్పష్టీకరణ
- ఇది ఆకస్మిక దాడుల కోసం ఆడుతున్న నాటకం : ఇరాన్

ఇరాన్‌తో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చర్చలు ముగిసే వరకూ, ఇరాన్ నేతలు, ప్రతినిధులు ఏకీకృత ప్రతిపాదనతో ముందుకొచ్చే వరకూ ఈ పొడిగింపు అమలులో ఉంటుందని, ఆ దేశంపై దాడులు చేయబోమని ఆయన చెప్పారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే ప్రశ్నే లేదని, దౌత్య యత్నాలు విఫలమైతే తక్షణమే సైనిక చర్య చేపడతామని నిన్నటి వరకూ చెబుతూ వచ్చిన ట్రంప్ గడువు ముగుస్తున్న వేళ మాట మార్చారు. 'ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతిన్నదన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని...పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ అశిం మునీర్, ప్రధాని షెహ్బాజ్ షరీఫ్ అభ్యర్థన మేరకు మేము దాడుల నిర్ణయాన్ని పక్కన పెట్టాం' అని ఆయన ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు.

3



## రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసు తీర్పు రిజర్వ్



3

## కాళేశ్వరం కథ ముగియలేదు

### సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు

- బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో
- మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,ఏప్రిల్ 22 (మహాప్రభ)

కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు -మిగతా 3 లో



# 70-80 శాతం రాజకీయ నేతలు పోర్న్ చూస్తారు



**పాట్నా ఏప్రిల్ 22 (మహాప్రభ )**
బీహార్‌లోని పూర్ణియా స్వతంత్ర ఎంపీ పప్పు యాదవ్ అలియాస్ రాజేష్ రంజన్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. సుమారు 70 నుంచి 80 శాతం మంది రాజకీయ నేతలు అశ్లీల చిత్రాలు చూస్తారని ఆయన ఆరోపించారు. తన ఫోన్‌తో సహా వారి ఫోన్లలో అలాంటి అశ్లీల కంటెంట్ ఉందో లేదో తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల మహిళా రిజర్వేషన్ల అంశంపై పప్పు యాదవ్ మాట్లాడారు. ‘పురుష నాయకుడి బెడ్‌రూమ్‌లోకి వెళ్లకుండా 90 శాతం మంది మహిళలు రాజకీయాల్లోకి ప్రవేశించలేరు’ అని అన్నారు. ఆయన చేసిన లింగవివక్ష వ్యాఖ్యలపై బీహార్ రాష్ట్ర మహిళా కమిషన్ నోటీస్ జారీ చేసింది. కాగా, ఈ నోటీస్‌పై పప్పు యాదవ్ బుధవారం స్పందించారు. తన వ్యాఖ్యలను ఆయన సమర్థించుకున్నారు. ‘70 నుంచి 80 శాతం మంది రాజకీయ నాయకులు పోర్న్ చూస్తారని సభలో కూడా నేను చెప్పాను. కాబట్టి అందరినీ తనిఖీ చేయించండి. ఒకవేళ నా ఫోన్‌లో అశ్లీల చిత్రాలు ఉంటే, నన్ను కూడా తనిఖీ చేయండి’ అని అన్నారు.మరోవైపు తనకు నోటీస్ జారీ చేసిన బీహార్ మహిళా కమిషన్ సభ్యురాలు సజల్ ఝాపై కూడా పప్పు యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ‘నాకు నోటీసు పంపిన ఈ వ్యక్తులు ఎవరు? వీరు ఎవరి పక్షాన ఉన్నారు?’ అని ఆయన ప్రశ్నించారు. మహిళా కమిషన్ సభ్యురాలు సజల్ ఝా పలువురు నాయకులతో ఉన్న ఫొటోలు తన వద్ద ఉన్నాయని, వాటిని బహిరంగపరుస్తానని ఆయన తెలిపారు. ‘మాజీ మంత్రుల ఫొటోలు చాలా ఉన్నాయి. గాజు ఇళ్లలో నివసించేవారు రాళ్లు విసరకూడదు. పురుష రాజకీయ నాయకులు మహిళలను వాడుకోకుండా రాజకీయాల్లోకి రానివ్వరని నేను చెప్పాను. అది తప్పా? నేను మహిళల కోసం పోరాడుతున్నా. వారు మహిళలను దోపిడీ చేస్తారు’ అని ఆయన అన్నారు. కాగా, తన వ్యాఖ్యలపై మహిళా కమిషన్ ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తోందని పప్పు యాదవ్ ప్రశ్నించారు. కొంతమంది రాజకీయ నాయకులు మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు వాదిస్తూనే అదే సమయంలో మహిళలను దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ‘755 మంది పురుష రాజకీయ నాయకులపై లైంగిక వేధింపుల కేసులు ఉండగా, వారిలో 155 మందిపై ఛార్జిషీట్లు ఉన్నాయి. భారతదేశం మొత్తం కళంకితమైంది. నేను పురుష రాజకీయ నాయకుల గురించి మాట్లాడితే, వారు (మహిళా కమిషన్) ఎందుకు కలవరపడుతున్నారు? ఈ రాజకీయ నాయకులు మహిళలను దోపిడీ చేసి, ఆ తర్వాత మహిళా రిజర్వేషన్ చట్టం గురించి మాట్లాడతారు’ అని అన్నారు. అయితే పప్పు యాదవ్ వ్యాఖ్యలను కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా విమర్శించాయి.

## ఖర్గేకు ఈసీ షోకాజ్ నోటీస్..

‘ఉగ్రవాది’ వ్యాఖ్యలపై చర్య



**న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (మహాప్రభ )**
ప్రధాని మోదీని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే ఉగ్రవాదిగా సంబోధించడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ విషయమై ఆయనకు బుధవారం షోకాజ్ నోటీస్ జారీ చేసింది. అంతకు ముందు బీజేపీ ఉన్నత స్థాయి బృందం ఖర్గే వ్యాఖ్యలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను కలిసి ఖర్గే చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసింది.ఆయనపై బీఎన్ఎస్‌లో సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని, ఆయనను హెచ్చరించాలని కోరింది. ఆయన వ్యాఖ్యలను అన్ని సామాజిక మాధ్యమాల వేదికల నుంచి తొలగించాలని కోరింది.

## గ్రవాదానికి భారత్ తలవంచదు: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (మహాప్రభ )**
పెహల్గామ్ ఉగ్రవాద దాడి ఘటన జరిగి ఏడాది అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానికి భారత్ తలవంచబోదన్నారు. తమ కార్యకలాపాలతో ఉగ్రవాదులు సక్సెస్ సాధించబోరన్నారు. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ.. జమ్మూకశ్మీర్‌లోని పెహల్గామ్‌లో సుమారు 26 మంది అమాయక పర్యాటకులను బలి తీసుకున్న విషయం తెలిసిందే. పెహల్గాం ఉగ్రవాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులను స్మరిస్తున్నానని, గత ఏడాది ఇదే రోజున ఆ ఘటన జరిగిందని, వాళ్లను ఎప్పటికీ మరిచిపోలేమని ప్రధాని అన్నారు.తన ఎక్స్‌లో ఆయన రియాక్ట్ అయ్యారు. ఉగ్రవాద బాధిత కుటుంబాల పట్ల సానుభూతి ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఓ దేశంగా కష్ట సమయంలో కలిసికట్టుగా ఉంటామని, భారత్ ఎటవంటి ఉగ్ర బెదిరింపులకు లొంగదని, ఉగ్రవాదుల కపట మోసాలు ఎన్నటికీ నిలవలేవన్నారు. పెహల్గామ్ ఉగ్రవాద దాడి ఘటన తర్వాత.. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌పై భారత్ సైనికచర్య చేపట్టింది. పాక్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశారు.

## ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్..

రోజూ 500 మిలియన్ల డాలర్ల నష్టం



**వాషింగ్టన్: న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (మహాప్రభ )**
ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు ఆచయన చెప్పారు. హోర్ముజ్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని ఇరాన్ భావిస్తున్నదని, ఎందుకంటే వాళ్లకు నగదు కొరత ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ ఆ దేశం సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ తెలిపారు. మిలిటరీకి, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. హోర్ముజ్‌ను మూసిన ఇరాన్ ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఆయన తెలిపారు.జలసంధిని బ్లాకేడ్ చేసినట్లు తాము చెప్పడం వల్లే ఇరాన్ దాన్ని మూయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం తన వద్దకు కొందరు వచ్చి హోర్ముజ్‌ను ఓపెన్ చేయాలని కోరారని, కానీ ఒకవేళ హోర్ముజ్‌ను తాము ఓపెన్ చేస్తే, అప్పుడు ఇరాన్‌తో డీల్ కుదుర్చుకోలేమన్నారు. ఒకవేళ ఆ దేశాన్ని మొత్తం పేల్చివేస్తే తప్ప మళ్లీ ఆ డీల్ కుదిరే అవకాశం ఉండదని ట్రంప్ అన్నారు.

## రెండు నౌకలను స్వాధీనం చేసుకున్న ఇరాన్



**టెహ్రాన్ ఏప్రిల్ 22 (మహాప్రభ )**
హోర్ముజ్ జలసంధిలో ఉల్లంఘనలకు పాల్పడిన రెండు నౌకలను ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) స్వాధీనం చేసుకుంది. ఈ విషయాన్ని బుధవారం వెల్లడించింది. నౌకలను, వాటి పత్రాలను తనిఖీ చేసేందుకు ఇరాన్ ప్రాదేశిక జలాలకు బదిలీ చేసినట్లు చెప్పింది. హోర్ముజ్ జలసంధిలో క్రమానికి, భద్రతకు ఆ నౌకలు విఘాతం కలిగిస్తున్నాయని పేర్కొంది. వీటిల్లో ఒక నౌకపై తీరం వద్ద కాల్పులు జరపగా రెండో నౌకపై ఒమన్ తీరంలో దాడి జరిగింది. ఈ దాడిలో ఆ నౌకకు నష్టం వాటిల్లింది. ఈ నౌకలను ఎంఎస్‌సీ-ఫ్రాన్సెస్కాగా ఐఆర్‌జీసీ గుర్తించింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ నౌకలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని, పలు దఫాలు ఉల్లంఘనలకు పాల్పడ్డాయని, నౌకాయాన సహాయక వ్యవస్థను ట్యాంపర్ చేశాయని, సముద్రయాన భద్రతకు ప్రమాదకారిగా మారాయని, రహస్యంగా జలసంధిని దాటే ప్రయత్నం చేశాయని ఐఆర్‌జిసి వివరించింది. హోర్ముజ్ జలసంధిలో రవాణాకు సంబంధించి ఇరాన్ చట్టాల అమలును అడ్డుకునేందుకు జరిగే ఏ ప్రయత్నమైనా నిర్ణయాత్మక, చట్టపరమైన చర్యలకు గురి కావాల్సి ఉంటుందని ఐఆర్‌జిసి పునరుద్ఘాటించింది.

## నేపాల్ హోం మంత్రి రాజీనామా

- ఆర్థిక వ్యవహారాలపై ఆరోపణలతో



**ఖాట్మాండు ఏప్రిల్ 22 (మహాప్రభ )**
ఆర్థిక వ్యవహారాలపై ఆరోపణలతో రావడంతో నేపాల్ హోం మంత్రి సుధాన్ గురుంగ్ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లోపే సుధాన్ గురుంగ్ మంత్రి పదవికి రాజీనామా చేయడం గమనార్హం. తన రాజీనామా విషయాన్ని గురుంగ్ బుధవారం సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించారు. ‘నాకు సంబంధించిన విషయాలపై నిష్పక్షపాత విచారణ జరిగేలా చూడటానికి, అలాగే నా పదవి కారణంగా ఎలాంటి ప్రయోజన వైరుధ్యం తలెత్తకుండా లేదా విచారణ ప్రక్రియ ప్రభావితం కాకుండా ఉండేలా నిర్ధారించుకోవడానికి, నేను ఈ రోజు హోం మంత్రి పదవికి రాజీనామా చేశాను’ అని ఫేస్‌బుక్ ఖాతా ద్వారా గురుంగ్ వెల్లడించారు. షేర్లతో సహా తన పెట్టుబడులపై తలెత్తిన ప్రశ్నలను తాను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కూడా గురుంగ్ తెలిపారు.ఇటీవల నేపాల్‌లో జరిగిన ఎన్నికల తరువాత మార్చి 27న హోం మంత్రిగా గురుంగ్ నియమితులయ్యారు. అవినీతి నిరోధక చర్యల్లో భాగంగా వివాదాస్పద వ్యాపారవేత్త దీపక్ భట్‌ను మనీలాండరింగ్ ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేశారు. ఈ తరువాత గురుంగ్‌కు, భట్‌కు మధ్య ఉన్న సంబంధాలు, అసాధారణ ఆర్థిక లావాదేవీలపై ఆరోపణలు వెల్లువెత్తాయి. నిజానికి గురుంగ్‌ను బాలేంద్రషా తన ప్రభుత్వంలో హోం మంత్రిగా నియమించడంపైనే అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి.

## రూ.3 వేలకు కక్కుర్తిపడి..

నిరుడు పహల్గాంలో ఉగ్రవాదులకు ఆశ్రయం



**న్యూఢిల్లీ : ఏప్రిల్ 22 (మహాప్రభ )**
పహల్గాం ఉగ్రదాడి జరిగి ఏడాదైంది. ఆ మారణహోమం మిగిల్చిన విషాదం 26 కుటుంబాలను ఇంకా వెంటాడుతూనే ఉంది. ఉగ్ర ఘటనకు సంబంధించి మరో కోణం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇందులో ఇద్దరు స్థానికుల దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులకు వారు ఆశ్రయం కల్పించారని, అవకాశం ఉన్నా.. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా ఉంచారని విచారణలో వెల్లడైంది.ఇందుకోసం వారు రూ.3 వేలు తీసుకున్నట్టు ఎన్ఐఏ విచారణలో తేలింది. స్థానికులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ వద్ద ముగ్గురు ఉగ్రవాదులు ఆశ్రయం పొందారు. ఆ సమయంలో వారి వద్ద ఆయుధాలు కనిపించాయి. లష్కరే తాయిబా అగ్ర కమాండర్, ప్రధాన నిందితుడు అలీభాయ్ గురించి మాట్లాడుకున్నారు.

## పంచంలోని 20 అత్యంత వేడి ప్రదేశాలలో 19 భారత్ లోనే నమోదు




**న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (మహాప్రభ )**
ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ 21వ తేదీన అత్యంత వేడి ఉష్ణోగతలు నమోదైన ప్రపంచంలో 20 వేడి నగరాల్లో 19 మన దేశంలోనే ఉన్నాయని ప్రపంచ ఎయిర్ క్వాలిటీ రిపోర్టు తాజాగా వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 22 నుంచి 24 వరకు దేశంలో కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగతలు 43 డ్రిగీలు వరకు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ బుధవారం హెచ్చరించింది. ఇక ప్రపంచ ఎయిర్ క్వాలిటీ రిపోర్టు తెలిపిన 19 అత్యంత వేడి నగరాల్లో బీహార్ 7, ఒడిశా రెండు, పశ్చిమ బెంగాల్ 8, ఉత్తరప్రదేశ్ లో 2 ఉన్నాయి. బీహార్ లోని భాగల్పూర్, ఒడిశాలోని తాల్చేర్, పశ్చిమ బెంగాల్లోని అసన్సోలు టాప్ జాబితాలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో మంగళవారం (ఏప్రిల్ 21) 44 డ్రిగీలు సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక బెగుసరాయ్, మోతిహారి, ముంగేర్, భోజ్‌పూర్, సివాన్‌లతో పాటు తూర్పు ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలు నమోదయ్యాయని ప్రపంచ ఎయిర్ క్వాలిటీ రిపోర్టు తెలిపింది. భారత్ కాకుండా అత్యంత వేడి నగరం నేపాల్‌లోని లుంబిని నమోదైందని ఇండియా టుడే నివేదించింది.

## తమిళనాడు, బెంగాల్‌లో రూ 1000 కోట్లు దాటిన సీజ్‌లు



**న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (మహాప్రభ )**
: అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్లో ఓటర్లను ప్రలోభాలకు సంబంధించిన స్వాధీనాలు రూ 1000 కోట్లను దాటాయి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ బుధవారం వెల్లడించింది. ఫిబ్రవరి 26న ఎన్నికల స్వాధీనాల నిర్వహణ వ్యవస్థ (ఇఎస్ఎంఎస్)ను ప్రారంభించినప్పటి నుంచి తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ల్లో ఇప్పటి వరకూ రూ.1,072.13 కోట్ల విలువైన ఉచితాలు, ప్రలోభాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎలక్షన్ కమిషన్ తెలిపింది. వీటిలో రూ.127.67 కోట్ల నగదు, రూ. 106.3 కోట్ల విలువైన దాదాపు 41 వేల లీటర్ల మద్యం, రూ. 184 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ. 215 కోట్ల విలువైన బంగారం, వెండి వంటి విలువైన లోహాలు ఉన్నాయి. అలాగే, రూ. 418 కోట్ల విలువైన ఉచితాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఎలక్షన్ కమిషన్ వెల్లడించింది.

## తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (మహాప్రభ )**
బుధవారం కేదార్‌నాథ్ ఆలయం ద్వారాలు తెరుచుకున్నాయి. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి దంపతులు ఆలయంలో మొదటి పూజలో పాల్గొనగా, హరహర మహాదేవ్, జై శ్రీ కేదార్.. అంటూ భక్తుల నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ వేడుకను వీక్షించడానికి వేలాది మంది భక్తులు కేదార్‌నాథ్ ఆలయానికి చేరుకోగా, ఆలయ ద్వారాలను భక్తుల కోసం లాంఛనంగా తెరిచారు.సీఎం ధామి, ఇతర అధికారులు యాత్రా ఏర్పాట్లను సమీక్షించారు. తొలి విడతలో వచ్చిన భక్తులు ఐదు నిమిషాల్లో తమ ప్రార్థనలు పూర్తిచేసుకున్నారని, పుణ్యక్షేత్ర ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహితంగా ఉంచటం ద్వారా ‘హరిత యాత్ర’కు మద్దతు ఇవ్వాలని సీఎం ధామి యాత్రికులను కోరారు. బద్రినాథ్ ఆలయ ద్వారాలు గురువారం తెరుచుకోన్నాయి.

## నేపాల్‌లో మళ్లీ నిరసనలు..

మొదటి తరువాయి

సరిహద్దుల్లో ఉన్న ప్రజలు అత్యవసరాల కోసం భారత్‌పై ఆధారపడతారని చెప్పారు. మరోవైపు విద్యార్థి సంఘాలను పట్టించుకోకుండా వాటిపై నిషేధం విధించినందుకు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ యూనిఫామ్‌లోని వేలాది మంది విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి నిరసన ప్రదర్శనల్లో పాల్గొనడం కొన్ని వీడియోల్లో కనిపించింది. నిరసనల తీవ్రత పెరుగుతుండటంతో బాలెన్ షా సర్కార్‌పై ఒత్తిడి పెరుగుతున్నది.ప్రజల అసంతృప్తి విస్తృత రాజకీయ సవాల్‌గా పరిణమించింది. ఇంకోవైపు దేశ హోం మంత్రి సుధన్ గురుంగ్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని, అనుమానాస్పద లావాదేవీల్లో పాల్గొంటున్నారని ఆరోపణలు వచ్చాయి. మనీ లాండరింగ్‌కు పాల్పడిన ఓ వ్యాపారి కంపెనీల్లో ఆయనకు షేర్లు ఉన్నాయని తెలియడంతోనే ఆయన రాజీనామాకు సొంత పార్టీ నుంచే డిమాండ్ వచ్చింది. ఈ నేపథ్యంలో తనపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిగేందు కోసం తాను రాజీనామా చేసినట్టు బుధవారం ఫేస్‌బుక్ పోస్ట్‌లో గురుంగ్ తెలిపారు. ఆర్థిక శాఖ ఈ ఆరోపణలపై విచారణ చేస్తుందని చెప్పారు. అధికారం స్వీకరించిన వెంటనే ఉన్నతాధికారులు, మాజీ ప్రధానుల అరెస్టుతో వార్తల్లో నిలిచిన ఆయనపై కొన్ని వారాలకే అవినీతి, ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు రావడం గమనార్హం.

## లక్నోను చిత్తు చేసిన రాయల్స్..

మొదటి తరువాయి

ఎంచుకున్న లక్నో.. ఈ ప్రదర్శనతో సంతృప్తి చెందే ఉంటుంది. కానీ బ్యాటింగ్‌లో ఆ జట్టు తేలిపోయింది. బ్యాటర్ల వైఫల్యం కొనసాగిస్తూ.. ఆ జట్టు 119 పరుగులకే కుప్పకూలింది.160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు ఆదిలోనే షాక్ తగిలింది. తొలి ఓవర్‌లోనే ఆయుష్ బదోనీ (0) డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (0), ఎయిడెన్ మార్‌క్రమ్ (0).. బదోనీని ఫాలో అయ్యారు. పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరిపోయారు. దీంతో స్వల్ప లక్ష్య ఛేదనలోనూ లక్నో ఒత్తిడికి గురైంది. ఓ పక్క వికెట్లు పడుతున్నా మిచెల్ మార్ష్ (55) పోరాడటంతో లక్నో పోటీలోనే ఉంది. కానీ అతడు ఔట్ అయ్యాక పరిస్థితి మారిపోయింది. పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న నికోలస్ పూరన్ (25 బంతుల్లో 22 రన్స్) ఈ మ్యాచ్‌లోనూ పెద్దగా రన్స్ చేయలేకపోయాడు. లక్నో బ్యాటర్లలో కేవలం ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోరు చేయడం గమనార్హం.రాజస్థాన్ బౌలర్ల దెబ్బకు లక్నో సూపర్ జెయింట్స్.. 18 ఓవర్లలో 119 పరుగులకు కుప్పకూలింది. జోఫ్రా ఆర్చర్ 3, నంద్రే బర్గర్ 2, బ్రిజేష్ శర్మ 2 వికెట్లు తీశారు. రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. కాగా ఈ ఫలితంతో లక్నోలో లక్నో సూపర్ జెయింట్స్ వరుసగా ఏడో మ్యాచులోనూ ఓడిపోయింది. ఈ విజయంతో రాజస్థాన్ పాయింట్స్ టేబుల్‌లో రెండో ప్లేసుకు దూసుకెళ్లింది. లక్నో 9వ ప్లేసుకు పడిపోయింది.

## నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

మొదటి తరువాయి

6 గంటల వరకు కొనసాగుతుంది. మే 4న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

తమిళనాడు రెడీ

అసెంబ్లీ పోరుకు తమిళనాడు సిద్ధమైంది. మొత్తం 234 స్థానాలకు గానూ వివిధ పార్టీల నుంచి 4,023 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మొత్తం 5.73 కోట్ల మందికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 2.93 కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు, 2.77 కోట్ల మందికి పైగా పురుష ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో వారి ఓట్లు కీలకం కానున్నాయి. ట్రాన్స్‌జెండర్లు 7728 మంది ఉన్నారు. మొత్తం 33,133 ప్రాంతాల్లో 75 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 3,60,068 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధులను నిర్వర్తించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరగనుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ డే కావడంతో నేడు తమిళ నాడుకు పబ్లిక్ హాలిడే ప్రకటించింది ఎన్నికల సంఘం.

బెంగాల్ దంగల్

పశ్చిమబెంగాల్ మొదటి విడత ఎన్నికలకు సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లోని 152 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి ఓటర్లు ఎన్నికల పండుగలో ఎక్కువ సంఖ్యలో పాల్గొనే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్ల మందికి పైగా పురుష ఓటర్లు కాగా.. 1.75 కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 465 మంది ఉన్నారు. .. బెంగాల్‌లో ఎన్నికల కోసం ఈసీ భారీ ఏర్పాట్లను చేసింది. దాదాపు 2.5 లక్షల మంది సిబ్బందితో పాటు రికార్డు స్థాయిలో 2,450 కంపెనీల కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించింది. ఏఐ సహాయంతో 152 నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను అమలు చేస్తోంది.

## తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు

**న్యూఢిల్లీ,**



బుధవారం కేదార్‌నాథ్ ఆలయం ద్వారాలు తెరుచుకున్నాయి. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి దంపతులు ఆలయంలో మొదటి పూజలో పాల్గొనగా, హరహర మహాదేవ్, జై శ్రీ కేదార్.. అంటూ భక్తుల నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ వేడుకను వీక్షించడానికి వేలాది మంది భక్తులు కేదార్‌నాథ్ ఆలయానికి చేరుకోగా, ఆలయ ద్వారాలను భక్తుల కోసం లాంఛనంగా తెరిచారు.సీఎం ధామి, ఇతర అధికారులు యాత్రా ఏర్పాట్లను సమీక్షించారు. తొలి విడతలో వచ్చిన భక్తులు ఐదు నిమిషాల్లో తమ ప్రార్థనలు పూర్తిచేసుకున్నారని, పుణ్యక్షేత్ర ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహితంగా ఉంచటం ద్వారా 'హరిత యాత్ర'కు మద్దతు ఇవ్వాలని సీఎం ధామి యాత్రికులను కోరారు. బద్రినాథ్ ఆలయ ద్వారాలు గురువారం తెరుచుకోన్నాయి

## రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసు తీర్పు రిజర్వ్

**సుల్తాన్‌పూర్**

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసులో తీర్పును మే 2వ తేదీకి తీర్పును స్థానిక ఎంపి, ఎమ్మెల్యేల కోర్టు రిజర్వ్ చేసింది. స్థానిక బీజేపీ నాయకుడు విజరు మిశ్రా ఫిర్యాదు మేరకు 2018 అక్టోబర్‌లో ఈ పరువునష్టం కేసు నమోదయింది. అప్పటి బీజేపీ అధ్యక్షులు, ప్రస్తుత కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై రాహుల్‌గాంధీ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదుతో ఈ కేసు నమోదయింది. ఈ కేసులో 2024 ఫిబ్రవరి 20న కోర్టు ఎదుట రాహుల్‌గాంధీ లొంగిపోయారు. దీంతో కోర్టు రూ. 25 వేల చొప్పున రెండు పూచీకత్తులపై రాహుల్ గాంధీకి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచింది.

## బ్రాండ్ ఆధారంగా ప్రాధాన్యత

మొదటి తరువాయి

ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై సీఎం రేవంత్‌రెడ్డికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ వేదికలపై ప్రభుత్వంతోఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని సీఎం ఆదేశించారు. దానికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని దిశానిర్దేశం చేశారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన పారిశ్రామిక ఒప్పందాలు, వాటి పురోగతిపై చర్చించారు.

# కదలని చక్రాలు

మొదటి తరువాయి



కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్- ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్-రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాల్పుల విరమణ పొడిగింపు

**న్యూఢిల్లీ,**

పశ్చిమాసియా సీజ్‌ఫైర్ విష యంలో మరో కీలక పరిణామం చోటు చేసుకున్నది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ మరో సారి పొడిగించారు. సైనిక చర్యను జాప్యం చేయాలని, దౌత్యానికి సమయం ఇవ్వాలని పాకిస్తాన్ కోరిందని, ఆ మేరకు నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ తెలిపారు. అయితే ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం కొనసాగుతుందని, తమ సైన్యం అప్రమత్తంగా సిద్ధంగా ఉంటుందని చెప్పారు. కాగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించిన ట్రంప్‌కు పాక్ ప్రధాని షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం దౌత్య యత్నాల కొనసాగింపుకు అవకాశం కల్పిస్తుందని చెప్పారు. చర్చల ద్వారా పరిష్కారం కనుగొనేందుకు పాకిస్తాన్ ప్రయత్నాలు కొనసాగిస్తుందని చెబుతూ ఇరు పక్షాలు కాల్పుల విరమణను గౌరవించి, తదుపరి విడత చర్చలలో సమగ్ర శాంతి ఒప్పందం దిశగా కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఒప్పందం పొడిగింపు వెనుక...**



ట్రంప్ మంగళవారం మధ్యాహ్నం శ్వేతసౌధంలో తన జాతీయ భద్రతా బృందంతో సమావేశమయ్యారు. ఇరాన్ విషయంలో ఏం చేయాలన్న దానిపై వారితో చర్చించారు. ఎందుకంటే ఇరాన్‌తో రెండు వారాల కాలానికి కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందం గడువు సమీపిస్తుండడంతో ఏదో ఓ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇరాన్‌తో రెండో విడత చర్చల కోసం ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాకిస్తాన్ బయలుదేరడానికి ముందు జాయింట్ బేస్ ఆండ్రూస్‌లోని రన్‌వేపై ఎయిర్ ఫోర్స్ టు విమానం సిద్ధంగా ఉంది. కానీ చర్చల విషయంలో ఇరాన్ నుంచి ఎలాంటి సానుకూలత వ్యక్తం కాక పోవడంతో అమెరికాకు ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి ఎదు రైంది. చర్చల సందర్భంగా ఇరాన్ అంగీకరించాల్సిన జాబితాను అమెరికా అంతకుముందే పంపింది. కానీ టెహ్రాన్ నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో చర్చల కోసం పాకిస్తాన్ వెళ్లినా సాధించే దేముంటుందన్న అనుమానం వ్యక్తమైంది.

శ్వేత సౌధంలో ట్రంప్, వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్ సేథ్, జాయింట్ చీఫ్స్ చైర్మెన్ డాన్ కెయిన్, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ సమావేశమై ఇరాన్ స్పందన కోసం వేచి చూశారు. వాన్స్ బృందం ఎయిర్ ఫోర్స్ టు విమానం ఎక్కే లోపు ఇరాన్ నుంచి ఏదో ఒక స్పందనను రాబట్టాల్సిందిగా అమెరికా అధికారులు పాక్ సైన్యాధ్యక్షుడు అశిం మునీర్‌ను కోరారు. అయినప్పటికీ ఫలితం శూన్యం.

## కాళేశ్వరం కథ ముగియలేదు

మొదటి తరువాయి

కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషన్ విచారణ చేసి ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుపట్టలేదన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ కూలిపోయిందని.. లక్ష కోట్లు వృథా చేశారని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, ఏటీఎంలా మారిందని అమిత్ షా, నడ్డా చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదా కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన కొన్ని అంశాలను చూసి సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ మండిపడ్డారు. పీసీ గోష్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌డీఎస్ఏ కూడా రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు ఉన్నాయని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. హైకోర్టు ఎక్కడా కూడా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడలేదని చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందన్నారు. ఆలస్యమైనా దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## ప్రభుత్వానికి చెంపపెట్టు

మొదటి తరువాయి

ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు.తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు.

## భవిష్యత్ ఇంధనం గ్రీన్ హైడ్రోజన్ !

మొదటి తరువాయి

ద్వారా నీటి ఎలక్ట్రాలసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్) ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, భారత్ ఇంధన భద్రతకు పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్ధత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి.

వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైంది.

భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు.

## కేసీఆర్, హరీశ్ రావులకు ఊరట

మొదటి తరువాయి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషి వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను కలిపి ఉమ్మడిగా తీర్పు వెలువరించింది. పిటిషనర్లపై కమిషన్ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తుతో పాటు ఇతర చర్యలేవీ తీసుకోరాదని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చట్టబద్ధంగానే ఉన్నప్పటికీ, ఆ కమిషన్ విచారణ తీరు చట్టబద్ధంగా లేదని తేల్చింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే...పిటిషనర్లు కేసీఆర్, హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషిలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గత ఏడాది జులై 31న ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తు చేయరాదని హైకోర్టు గతేడాది సెప్టెంబర్ 2న మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. బుధవారం వెలువడిన తీర్పు ప్రకారం మధ్యంతర ఉత్తర్వులు తుది ఉత్తర్వుల య్యాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు గురైందని చెప్పి ప్రభుత్వం జస్టిస్ ఘోష్ కమిషన్‌తో విచారణకు ఆదేశించడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వానికి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ఉందని వెల్లడించింది. ఈ క్రమంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిజనిర్ధారణ మాత్రమే చేయాలనీ, ఎవరు తప్పు చేశారో చెబుతూ వాళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలనే ధోరణిలో నివేదిక ఇవ్వడాన్ని ఆక్షేపించింది. కమిషన్ విచారణ సమయంలో సాక్షులు ఇచ్చిన సమాచారాన్ని, ఆధారాలను పరిశీలించాక ఎవరిపైన అయినా అభియోగాలు ఉన్నాయని భావిస్తే.. సదరు సాక్షికి ఆ వివరాలు, అభియోగాలు తెలియజేసి వివరణ తీసుకోవాలన్న కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్‌లోని సెక్షన్ 8(బి), 8(సి) సెక్షన్ల నిబంధనలను అమలు చేయలేదని తప్పుపట్టింది. వరుసగా సాక్షుల వివరాలు తీసుకుని వాటిని పరిగణనలోకి తీసుకుంటూ తుది నివేదిక ఇవ్వడం చట్ట వ్యతిరేకమని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి లేదా సాక్షి ఒకరిపై చేసిన ఆరోపణలను అతనికి అందజేసి వివరణ తీసుకోవాలని ఆ రెండు సెక్షన్లు స్పష్టం చేస్తున్నాయని తెలిపింది. ఇక్కడ పిటిషన్లకు జస్టిస్ ఘోష్ కమిషన్ అలాంటి అవకాశం ఇవ్వలేదని విచారణలో తేల్చింది.

## సంపాదకీయం

# ఏం సందేశమిచ్చారు...?




'రెండు నలుపులు కలిస్తే ఒక తెలుపు కానే కాదు...' అన్నారు పెద్దలు. అలాగే ఉంది వారిద్దరి వరస. ఒకరేమో ప్రభుత్వాధినేత.. మరొకరు ప్రధాన ప్రతిపక్ష నేత... ఇటీవల వీరిద్దరూ నిర్వహించిన భారీ బహిరంగ సభలతో యావత్ తెలంగాణ ప్రజానీకానికి ఏం సందేశమిచ్చా రనేది భూతద్దం పెట్టి వెతికినా కానరావటం లేదు. 'మళ్లీ అధికారంలో కొస్తాం...' అంటూ ఒకరు హూంకరిస్తే, 'ఎట్లా వస్తారో చూస్తాం...' అంటూ మరొకరు రంకెలేశారు. విమర్శలు, ప్రతి విమర్శలు, దూషణ భాషణలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు దాటి వ్యక్తిత్వ హననం, ఆవేశం హద్దులు దాటి ద్వేషం, ఆ స్థానంలో బూతు పురాణాలు ఊపందుకున్నాయి. కొన్ని పత్రికలు ఎలాంటి కత్తిరింపులు లేకుండా ఆ ఇద్దరు నేతలు వాడిన భాషనే యధాతథంగా ప్రచురించాయి. ఇంతకీ సీఎం, మాజీ సీఎం పరుష పదాల ద్వారా ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారు? రాష్ట్రంలో అసలు సమస్యలే లేనట్టు.. ఉన్నా అవి అప్రధానమన్నట్టు వారిరువురూ వ్యవహరిం చటం అత్యంత శోచనీయం. పదేండ్లపాటు అధికారంలో ఉన్న గులాబీ పార్టీ... తెలంగాణను అప్పుల కుప్ప చేయగా.. ఆ అప్పులను సాకుగా చూపి, హామీల ఎగవేతకు శ్రీకారం చుట్టింది హస్తం పార్టీ. పైగా 'రొట్టే లేదురా అంటే.. అది ఉంటే నెయ్యి వేసుకుని అద్దుకు తినేవాణ్ని...' అన్నట్టు ఇరువురూ తమ తమ వాగాడంబరంతో అసలు సమస్యలను పక్కదారి పట్టించేందుకు శతవిధాలా ప్రయత్నించారు. ప్రజలకు దీర్ఘకాలంలో అవసరమైన విద్య, వైద్యం, వ్యవసాయం, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఉపాధి, సంక్షేమం తదితరాంశాలపై వారు పెదవి విప్పలేదు. రాష్ట్రంలోని రైతాంగం సమస్యలు, ఎరువుల కొరతను ఏకరువు పెట్టలేదు. నూతన విద్యా విధానం, విద్యుత్ పాలసీలు, ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించి కేంద్రం.. రాష్ట్రంపై చేస్తున్న ఒత్తిడి గురించి మచ్చుకైనా మాట్లాడలేదు. ఆర్టీసీ సమ్మె, కార్మికుల సమ్మె గురించి వీరికి అసలు పట్టనే లేదు. ఆ సంస్థలోని సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామంటూ మాటిచ్చిన మాజీ సీఎం... తాను గద్దె దిగిపోయేదాకా ఆ పనిచేయేలేదు. ఏపీలో మాదిరిగా ఆర్టీసీని ప్రభుత్వపరం చేస్తామంటూ ఎన్నికల సమ యంలో చెప్పిన నేటి సీఎం... ఆ అపాయింట్ మెంట్ డేట్ గురించి ఎప్పుడో మరిచిపోయారు. మహిళా బిల్లును అడ్డం పెట్టుకుని డీలిమిటేషనే ధ్యేయంగా కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన బిల్లుల గురించి ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి సభలో చెప్పకపోవటం విడ్డూరం. విధాన పరంగా కాంగ్రెస్ దీన్ని పార్లమెంటులో వ్యతిరేకించింది. గులాబీ పార్టీ కూడా దాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. కానీ వేలాది మంది ప్రజలు హాజరైన సభల్లో ఈ అంశాన్ని ఎత్తిచూపటం ద్వారా మోడీ సర్కార్ వైఖరిని ఎండగట్టాలన్న సోయి ఇద్దరికీ లేకపోవటం ఆందోళనకరం. కార్మికులకు అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లను అమలు చేసి తీరాలంటూ రాష్ట్రాల మెడపై కేంద్రం కత్తి పెట్టింది. తెలంగాణలోని లక్షలాది మంది అసంఘటితరంగ కార్మికులు ఇది ఆశనిపాతం. ఈ విషయంలో కేంద్ర విధానాలను తూర్పారబట్టాల్సిన సీఎం, మాజీ సీఎం కిమ్మనకపోవటం దేనికి సంకేతం? సమగ్ర ఓటరు సవరణ (సర్) ద్వారా అన్ని రాష్ట్రాలతోపాటు తెలంగాణలోని ఓట్లను తొలగించేం దుకు మోడీ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్న తరుణంలో కాంగ్రెస్ సారు, గులాబీ బాసు ఇద్దరూ సైలెంట్‌గా ఉండటం రాష్ట్రానికి క్షేమదాయకం కాదు. వీరిద్దరి భాష, వ్యవహారశైలి చూస్తే ఆంధ్రా, తమిళనాడు తరహాలో తెలంగాణ కూడా 'పవర్ పాలిట్రిక్స్' చక్రబంధంలో చిక్కుకుపోయిందనే ప్రమాదకర సంకేతాలు బలంగా వినబడుతున్నాయి. సబ్జెక్ట్ (విషయం) పక్కకుపెట్టి... ఆబ్జెక్ట్ (పైపైన కనిపించేవి)కే మన నేతలు ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నట్టు కనబడుతోంది. ఇలాంటి వాటికి తాత్కాలికంగా జనాలు ఈలలేయొచ్చు.. చప్పట్లతో సభా ప్రాంగణాలు మార్మోగిపోవచ్చు. కానీ దీర్ఘకాలంలో రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ఎంతమాత్రమూ ఉపయోగపడని అంశాలివి. సీపీఐ(ఎం) అగ్రనేత సీతారాం ఏచూరి... 'నేతా నహీ.. నీతి బదలావో...' అని ప్రజలకు సూచించారు. అంటే నేతలను కాదు.. వారి విధానాలను చూడండి అని అర్థం. అందుకే అధికార పక్షం ఎప్పుడూ బాధ్యతనెరిగి ప్రవర్తించాలి. సంక్షేమం, అభివృద్ధి అనేవి రెండు కండ్లని చెప్పటం కాకుండా చేతల్లో చూపించగలగాలి. ప్రధాన ప్రతిపక్షం కూడా వ్యక్తుల ఆధారంగా కాకుండా విధానాల ప్రాతి పదికన మాట్లాడాలి. తద్వారా నిర్మాణాత్మక సూచనలు, సలహాలను ఇవ్వాలి. ఇవి రెండూ జరిగితేనే ప్రజలకు ప్రయోజనం. లేదంటే ఒక నాయకుడు వస్తాడు, మరో నాయకుడు పోతాడు, ఓ పార్టీ గెలుస్తుంది, మరో పార్టీ ఓడిపోతుంది... కానీ అంతిమంగా ప్రజలు మాత్రం నిత్యం ఓడిపోతూనే ఉంటారు. ప్రజాస్వామ్య దేశంలో వారెప్పటికీ ఓడిపోకూడదు.

# ఎండ తీవ్రతతో వ్యవసాయ రైతులు జాగ్రత్తగా ఉండాలి

**-తాసిల్దార్ జయశ్రీ ఎంపీడీవో చంద్రమౌళి సర్పంచ్ రామావత్ చిరంజీవి**



**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 22 (మహాప్రభ )** పీఏపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద ప్రభుత్వం వడ్లు కొనుగోలు కేంద్రం సిసి వద్ద రైతులకు మరియు కూలి పని చేసుకునే అమానీల పని రైతులకు ఎండ తీవ్రతతో రైతులు ఇబ్బంది పడకుండా ఉండడానికి ఓఆర్ఎస్ (ౌా=ా) పంపిణీ కార్యక్రమం స్థానిక అంగడిపేట సర్పంచ్ రామావత్ చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన వడ్ల కనుగోలు కేంద్రానికి విచ్చేసిన తాసిల్దార్ జయశ్రీ ఎంపీడీవో చంద్రమౌళి అక్కడ ఉన్న రైతు కూలీలకు ఓఆర్ఎస్ ఎండ తీవ్రత ఎక్కువ ఉండడం వలన రైతుల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎమ్మార్వో జయశ్రీ ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ ఓఆర్ఎస్ అంటే ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ ఇది విరోచనాలు వాంతులు లేదా విపరీతమైన చెమట కారణంగా శరీరంలో కూలిపోయిన నీరు లవణాలను ఎలక్ట్రోలైట్స్ ద్రవం ఉపయోగపడుతుంది

నీరు కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడానికి లవణాలు ఎలక్ట్రోల్ లైట్స్ సోడియం మరియు పొటాషియం వంటివి శరీర పని తీరుకు అవసరం చక్కెర గ్లూకోజ్ ప్రేగులు వీటిని త్వరగా గ్రహించబడి సహాయపడుతుంది టెండర్ త్రీవ్రతతో విరోచనాలు మరియు వాంతులు శరీరంలో నీటి శాతం తగ్గిపోయినప్పుడు డిహైడ్రేషన్ ప్రాణ రక్షణంగా పనిచేస్తుంది వడదెబ్బ హార్ట్ స్ట్రోక్ వేసవిలో అధిక ఉష్ణోగ్రత వల్ల నిరసించినప్పుడు డిహైడ్రేషన్ వల్ల వచ్చే మరణాలను నివారించడానికి ఇది అతితో మార్గం అని మాట్లాడడం జరిగింది నిర్జీకరణ లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యుని సంప్రదించాలి. ఈ కార్యక్రమంలో రైతు కూలీలు మరియు ఆశా వర్కర్లు వివిధ తాసిల్దార్ సిబ్బంది ఎంపీడీవో సిబ్బంది అలాగే గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# యావపూర్ బస్టాండ్ లో చలివేంద్రన్ని ప్రారంభించిన ఆంక్షరెడ్డి.




**తూప్రాన్, ఏప్రిల్ 22 (మహాప్రభ)** తీవ్ర ఎండలు కాస్తున్న నేపథ్యంలో వేసవిలో బాటసారుల ప్రయాణికుల దాహార్తిని తీర్చుటకు తూప్రాన్ మండలం యావపూర్ గ్రామ సర్పంచ్ యంజాల స్వామి యావపూర్ బస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన చిన్నారుల కార్యక్రమాల్లో పాల్గొని చిన్నారులు చేసిన నృత్యాలను వీక్షించి ప్రశంసించారు. ఇందులో గ్రామ సెక్రెటరీ, ఉపసర్పంచ్, పాలకవర్గం సభ్యులు, చెట్లపల్లి రామస్వామి, రామని స్వామి, జింక మల్లేష్, వెంకటాయపల్లి నరసింహ, వెంకటయపల్లి కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎం పి డి ఓ. డేనియల్ కు ఘన సన్మానం

**-బిజెపి పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్**



**దేవరకొండ ఏప్రిల్ 22( మహాప్రభ )** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, ఎస్ డి డేనియల్ కు భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు సుధాకర్ మరియు ప్రజాభిమాని చిత్రం ప్రదీప్ ఆధ్వర్యంలో శాలువాతో ఘన సన్మానం చేశారు. బిజెపి పట్టణ అధ్యక్షులు వస్కు ల సుధాకర్ మాట్లాడుతూ తమరు దేవరకొండకు ఎంపీడీవో గా రావడం పట్టణ ప్రజల అదృష్టమని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ వారి వారి సమస్యలను పరిష్కరించి సత్వర న్యాయం చేకూర్చి న్యాయం చేయాలని కోరారు. ప్రజా అభిమాని చిత్రం ప్రదీప్ మాట్లాడుతూ మీ పరిధిలోని ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని నిస్వార్థంగా సేవలు అందించాలని విన్నవించుకున్నారు. తమను గౌరవించి సన్మానించినందుకు ఎంపీడీవో డానియల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తనపై ఉంచిన అధికారాలను ప్రజలకు న్యాయంగా పరిష్కరిస్తానని తన పరిధిలోని ప్రభుత్వం ద్వారా వచ్చిన అన్ని పథకాలను నిస్వార్థంగా అందిస్తానని వారు సవివరంగా తెలిపారు ఈ కార్యక్రమంలో , పీటర్, వేణు. జోసెఫ్ తదితరులు పాల్గొని నూతనముగా వచ్చిన ఎంపీడీవోకు కృతజ్ఞతలు తెలిపారు

# పోషక పక్వాడా కార్యక్రమం

**-ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాటును పెంపొందించడం**



**గాంధారి ఏప్రిల్ 22 (మహా ప్రభ)** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం మాధవపల్లి గ్రామంలో అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం "పోషణ పక్వాడా" కార్యక్రమంలో భాగంగా స్క్రీన్ టైం తగ్గించడం.తల్లిదండ్రులు, సమాజం కలిసి ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లను పెంపొదించడం స్క్రీన్ టైం అధికంగా వాడడం వలన కలిగే హానికరమైన ప్రభావాల గురించి వివరించారు. వేసవి కాలంలో పిల్లల పట్ల తంల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, చట్టాలు చైల్డ్ హెల్ప్‌లైన్ అందించే సేవల గురించి అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆన్లైన్ బెట్టింగ్స్ మొదలైన విషయాల ద్వారా పిల్లలు, యువత ఏవిధంగా నష్టపోతున్నారనేది వివరించారు. డిస్ట్రిక్ చైల్డ్ (ప్రొటెక్షన్ యూనిట్ చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ స్రవంతి, అంగన్ వాడి కార్యకర్త సునిత, స్కూల్ ప్రధానోపాధ్యాయులు పోచయ్య, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగేశ్వర్రావు, ఉప సర్పంచ్ శివాజీరావు,ఐకేపీ సభ్యులు,గర్భిణి బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహాలను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకురాలు ఆంక్ష రెడ్డి.



**తూప్రాన్, ఏప్రిల్ 22 (మహాప్రభ)** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల నిర్మాణ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుంది. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు పూర్తి చేసుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు తూకుంట ఆంక్ష రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి వారి చేతుల మీదుగా నూతన గృహ ప్రవేశాలను ప్రారంభించారు. ఇందులో ఇస్లాంపూర్ గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి, యావపూర్ సర్పంచి యాంజాల స్వామి, దాతర్ పల్లి సర్పంచ్ జయరాములు, కాంగ్రెస్ నాయకులు జింక మల్లేష్, నాయకులు దోమలపల్లి కృష్ణ, చుక్క శ్రీశైలం, ఆకుల రవి, లంబ రమేష్, బక్క నవీన్, తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**గన్నేరువరం, ఏప్రిల్ 22( మహాప్రభ )** తిమ్మాపూర్ మండలం నేదునూర్ గ్రామం నుండి పీచుపల్లి గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రిపూట ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ కోహెడ రాజు, యజమాని మంద శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.



# ఘనంగా ఎల్లమ్మ బోనాల పండుగ.. గౌడ సంఘం ఆధ్వర్యంలో



**గాంధారి, ఏప్రిల్ 22 (మహా ప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో ఎల్లమ్మ బోనాల పండుగలు గౌడ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించి ఎల్లమ్మ బోనాల పండుగను మంగళవారం సాయంత్రం సంతాన ఎల్లమ్మ కు ఇంటికి రెండు చొప్పున దాదాపు 160 బోనాలు చేయడం జరిగింది. గాంధారి మండల కేంద్రంలో సుమారు మూడు కోట్లతో నిర్మించిన ఆలయానికి గాంధారి మండలం తో పాటు పక్క మండలాల నుండి భారీ సంఖ్యలో భక్తులు హాజరై ముక్కులు చెల్లిస్తున్నారు.. సంతానం కాని వారికి సంతానాన్ని ప్రసాదించే అమ్మవారి గా ంధారి ఎల్లమ్మ పేరు గాంచింది. దాంతో ప్రతి మంగళవారం శుక్రవారం ఆదివారం భక్తులు ఆలయానికి చేరుకొని మొక్కులు మొక్కి అవి తీరగానే పండగలను నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజగౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు సారంపల్లి కృష్ణగౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు నారా గౌడ్, పెద్దలు సాయగౌడ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, రవిగౌడ్, జనార్దన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

- శివంపేట ఎస్.ఐ. మధుకర్ రెడ్డి



**శివంపేట, ఏప్రిల్ 22 (మహాప్రభ):**
శివంపేటమండల పరిధిలోని ప్రధాన రహదారులపై మరియు అంతర్గత రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని శివంపేట ఎస్.ఐ. (SHO) మధుకర్ రెడ్డి గారు తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపై ధాన్యం ఆరబోసిన రైతులతో ఎస్.ఐ. సమావేశమై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం వేయడం వల్ల బైక్‌లు స్కిడ్ అయ్యి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులకు రోడ్డుపై ఉన్న ధాన్యం కనిపించక తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో (IACP) లేదా కల్లాల్లో మాత్రమే ఆరబోసుకోవాలని సూచించారు. రోడ్లనే కల్లాలుగా మార్చుకుంటే ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా, సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.
ప్రతి ఒక్కరూ సాటి మనుషుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని పోలీసులకు సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడం మరియు జరిమానాలు విధించడం తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడి ముద్దు" నినాదంతో బడిబాట కరపత్రం ప్రారంభం



**శివంపేట, ఏప్రిల్ 22(మహాప్రభ):**
శివంపేట మండల కేంద్రంలో "బడిబాట" కరపత్రాన్ని గ్రామ సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "ప్రైవేట్ బడి వద్దు -- ప్రభుత్వ బడి ముద్దు" అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెద్దగోని శ్రీనివాస్ గౌడ్, తాజా మాజీ వార్డు సభ్యులు ముయ్యడ్డి సింహం, దొడ్ల అశోక్, హై స్కూల్ హెడ్మాస్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోతుల బెడదతో భయాందోళనలో ప్రజలు

**కరీంనగర్,ఏప్రిల్ 22(మహాప్రభ):**
పట్టణంలోని పలు డివిజన్లలో కోతుల సమస్య తీవ్రరూపం దాల్చి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్న పిల్లలపై, గృహిణులపై, పాదచారులపై దాడులు చేస్తూ ఇళ్లలోకి ప్రవేశించడం వల్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాల్లో స్థానికులు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోతులను పట్టే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, వాటిని జనావాసాలు లేని ప్రాంతాల్లో విడిచిపెట్టాలని తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# రైతు బిడ్డ ప్రతిభకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**కామారెడ్డి, ఏప్రిల్ 22 (మహా ప్రభ)**
రైతు కుటుంబంలో జన్మించిన ఓ విద్యార్థి తన ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో మెరిసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన శ్రీహర్షిత్, ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో 5వ ర్యాంక్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందాడు. దేవునిపల్లి మైనారిటీ జూనియర్ రెసిడెన్షియల్ కాలేజీ (ఎంఆర్‌జేసీ)లో చదువుతున్న హర్షిత్, మొత్తం 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. పరిమిత వనరులు, సాధారణ రైతు కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికీ కృషి, పట్టుదలతో ఈ ఘనత సాధించడం విశేషమని అధికారులు, విద్యావేత్తలు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం.



రాజేష్ చంద్ర, ఐపీఎస్ హర్షిత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అతని క్రమశిక్షణ, చదువుపై నిబద్ధతే ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగలరని హర్షిత్ నిరూపించాడన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, "చదువు భయం కాదు.. భవిష్యత్తును మార్చే శక్తి" అని సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ హర్షిత్‌ను ఆదర్శంగా తీసుకుని కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ఆటంకాలు వచ్చినా వెనకడుగు వేయకుండా లక్ష్య సాధన కోసం శ్రమిస్తే ఉన్నత శిఖరాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. హర్షిత్ సాధించిన విజయం జిల్లాలోని విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రపంచ ధరిత్రీ పరిరక్షణ అవగాహన దినోత్సవ కార్యక్రమం

**శేరిలింగంపల్లి ఏప్రిల్ 22 (మహాప్రభ)**
ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా మసీదుబండ (కొండాపూర్)లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి రజని అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఎర్త్, సముద్రం, పర్యావరణ శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్యులు జి. కిషోర్ కుమార్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ --- ఏప్రిల్ 22న ప్రపంచవ్యాప్తంగా 1970 సంవత్సరం నుండి ప్రతి ఏడాది ఒక నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం నినాదం "మన శక్తి -- మన గ్రహం" అని, సుస్థిర భవిష్యత్తు కోసం పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కాలుష్యం, అటవీ



నిర్మూలనం, ప్లాస్టిక్ అధిక వినియోగం, సహజ వనరుల అధిక వినియోగం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని, దాని ప్రభావంగా అతివృష్టి, అనావృష్టి, తుఫానులు పెరుగుతున్నాయని వివరించారు. పరిశ్రమల కార్బన్ ఉద్గారాలు, రసాయన కాలుష్యం, కలుషిత నీటి వినియోగం వలన క్యాన్సర్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం పర్యావరణ కాలుష్యం వల్ల సుమారు 19% క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. అందరికీ ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం రెడ్యూస్ , ర్థ?యూస్ , రిసైకిల్ విధానాలను పాటించాలని సూచించారు. చెట్లు నాటడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, పరిశుభ్రమైన నీరు త్రాగడం, సేంద్రీయ ఆహారం తీసుకోవడం, నిత్యం యోగా, వ్యాయామం చేయడం వంటి చర్యలు పాటించాలని సూచించారు. అలాగే వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించడం, సౌర, పవన, జల విద్యుత్ వంటి పునరుత్పాదక శక్తి వనరులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అందరితో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో ఉపప్రధానోపాధ్యాయులు అంబేద్కర్, అధ్యాపకులు శ్రీనివాసు, శ్రీనివాస్ గౌడ్, విద్యార్థులు మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, వాణి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కేసులో న్యాయం గెలిచింది.

-పీసీ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు తీర్పుకు హర్షం.
-మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి..

**మెదక్ జిల్లా -22ఏప్రిల్ (మహాప్రభ ).**
కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్లేనని పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు



వ్యాఖ్యానించడం అత్యంత కీలక పరిణామమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు, మాజీ మంత్రి హరీష్ రావు గారిపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. అయితే న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని అన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు మరియు మాజీ మంత్రి హరీష్ రావు గారి ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్ గారిపై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్ మరియు బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతో కనువిప్పు కలగాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని తెలిపారు.

# లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు



**కరీంనగర్, ఏప్రిల్ 22( మహాప్రభ):**
కరీంనగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య మరియు సిబ్బంది నిఘా పెట్టి సరైన పత్రాలు లేని 140 వాహనాలను సీజ్ చేశారు. ఎంవీ యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించి, వాహనదారులకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి హెచ్చరించారు. రహదారి భద్రత కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# చిన్న గొట్టిముక్కల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**శివంపేట,ఏప్రిల్ 22( మహాప్రభ):**
ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం శివంపేట మండలంలోని చిన్నగొట్టిముక్కల లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రైతులకు కొనుగోలులో ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

-బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్



**దేవరకొండ ఏప్రిల్ 22( మహాప్రభ)**
ప్రతి ఒక్కరూ పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లినీ బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఈ ప్రాంత ప్రజలు పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందంగా మెలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె న్యాయబద్ధమైనది.

-తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.
-సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన సిపిఐ ఏఐటీయూసీ



**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 22( మహాప్రభ ).**
బుధవారం లితెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు దేవరకొండ పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలిపారు . ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు ఎండి మైనొద్దీన్,సిపిఐ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు మాట్లాడారు ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు మొగిల్లా వెంగలయ్య,అలామోని మల్లయ్య, కందుకూరి శ్రీను,ఎండి వాహబ్,దోమల వెంకటయ్య,వి వీరయ్య,పి కృష్ణయ్య,ఎం మల్లయ్య, వినయ్ ఆర్టీసీ జేఏసీ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# ఆకాల వర్షంతో వరి పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,
దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.







**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 22 (మహాప్రభ )**
అకాల వర్షంతో వరి పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొండమల్లెపల్లి మండలం చెన్నారం గ్రామంలో అకాల వర్షంతో వరి పంట ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... రైతులకు నష్ట పరిహారం అందించాలని ఆయన కోరారు. నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు అందించాలని ఆయన కోరారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడం జరిగింది అని ఆయన గుర్తు చేశారు. రైతులకు బిఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,రైతులు తదితరులు ఉన్నారు.

# గణేష్ నగర్‌లో దోమల నివారణ తక్షణ చర్యలు



**కరీంనగర్, ఏప్రిల్ 22 (మహాప్రభ )**
కరీంనగర్ పట్టణంలోని గణేష్ నగర్ 57వ డివిజన్ బైపాస్ రోడ్‌లోని పెద్ద మోరి ప్రాంతంలో దోమల సమస్య తీవ్రంగా పెరిగింది. స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ--శ్రీనివాస్ ఈ సమస్యను గుర్తించి మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. తక్షణ చర్యగా ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 57వ డివిజన్ పరిధిలోని వీధుల్లో మస్కిటో ఫాగింగ్ నిర్వహించారు. చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులకు కారణమయ్యే దోమల నివారణ కోసం కెమికల్ పొగ వదిలి ప్రజలకు ఉపశమనం కల్పించారు. ప్రజల సమస్యను ముందుండి పరిష్కరించిన కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను

# తక్షణమే పరిష్కరించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్




**దేవరకొండ ఏప్రిల్ 22 ( మహాసభ )**
దేవరకొండ పట్టణంలో తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె చేస్తున్న సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం దేవరకొండ నియోజకవర్గం ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోలో తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్ లను పునరుద్ధరిస్తామని, 2021 నుండి 2025 వేతన సవరణ, అవుట్సోర్సింగ్ ,కాంటాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ,ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నడిపిస్తామని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ తక్షణమే చెల్లిస్తామని ,పెంచిన పనిభారాలను తగ్గించాలని, తక్షణమే ఈ డిమాండ్లను ఆర్టీసీ యాజమాన్యం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తూ కార్మికులకు అండగా ఉంటూ సమస్యలు సాధించేవరకు ఉద్యమాలు చేస్తామని ఉద్యమాల ద్వారానే సాధించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, డాక్టర్ భాషా చౌహాన్, పున్న వెంకటేష్ నేత, పెరికేటి శ్రీనివాస్ చారి ,భీమగోని శివ గౌడ్ తెలంగాణ ఆర్టీసీ జెఏసి చైర్మన్ ఇరగ దండ్ల శీను వైస్ చైర్మన్ ఓరుగంటి రమేష్ గౌడ్ కోశాధికారి నరహరి కార్మికులు పాల్గొన్నారు.

## సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ

# అధ్యాపక కార్యవర్గం ఏర్పాటు: టిజిఆప్ట

యూనివర్సిటీ అధ్యక్షులుగా డా. సి హెచ్ చంద్రయ్య.


TELANGANA STATE ALL UNIVERSITIES
PART-TIME TEACHER'S ASSOCIATION
(TG-AUPTA)
TELANGANA STATE, HYDERABAD

Date : 21-04-2026



**హైదరాబాద్, ఏప్రిల్ 22,(మహ ప్రభ)**
తెలంగాణ అల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం అధ్యాపకుల సంఘము (టిజిఆప్ట) అధ్వర్యంలో మంగళవారం రోజు సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కమిటీ నియమించడం జరిగింది. వివిధ రకాలుగా పనిచేస్తున్న అధ్యాపకులు పార్ట్ టైం( అవర్ బేసిస్), గెస్ట్ పాకల్టీ, ఏక మొత్తం పాకల్టీ లుగా పనిచేస్తున్నారు. అందరికీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం ప్రతి అధ్యాపకునికి నెలకు 50,000/- జీతం కన్సాలిడేటెడ్ పేమెంట్ ఇవ్వాలని, ఇంత వరకు టీజీఆప్ట చేసిన, చేస్తున్న ప్రయత్నాలు ప్రభుత్వ స్పందన వివరించి అధ్యాపకుల సమిష్టికృషి వల్లనే లక్ష్యం చేరుకొంటామని దిశానిర్దేశం చేయడం జరిగింది. అనంతరం యూనివర్సిటీ కమిటీ నియమించడం జరిగింది. అందరి ఆమోదంతో సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ (టీజిఆప్ట -ఎస్ పిఆర్ టియూ) అధ్యక్షులుగా డా.సి హెచ్ చంద్రయ్య, ప్రధాన కార్యదర్శగా డా. ఎం. రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా డా. ఎన్ శ్రీనివాసన్, డా. షేక్ హసీన, డా. రవీందర్ నాయక్, డా. రాయల హరిచంద్ర, డా మంచాల మహేశ్వర్ లను అందరి అధ్యాపకుల ఆమోదంతో నియమించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా టి జి ఆప్ట రాష్ట్ర కార్యవర్గం నూతనంగా ఎంపికైన యూనివర్శిటీ కమిటీకి అధ్యక్ష కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలుపుతూ అధ్యాపకుల సంక్షేమం కోసం పనిచేయాలని మీకు రాష్ట్ర నాయకత్వం ఎల్లవేళలా తోడుగా ఉంటుందని, ప్రజాప్రభుత్వంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారులతో ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకునేలా పనిచేయాలని టీజీఆప్ట రాష్ట్ర కార్యవర్గం సూచించింది.

## మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు

# కాంగ్రెస్ లో చేరికలు

మెదక్ రాజకీయాల్లో కీలక మార్పుకు దారితీసే విధంగా, బీఆర్ఎస్ పార్టీకి మరో పెద్ద షాక్ తగిలింది..



**మెదక్ జిల్లా -22ఏప్రిల్ (మహాప్రభ ).**
మెదక్ మున్సిపల్ పరిధిలో భాగంగా 27 వార్డ్ కౌన్సిలర్ అస్త్రగల్ల రాణి బాలరాజు ఈరోజు కొంపల్లి నివాసంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంత్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ పరిణామం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రభావం రోజురోజుకీ పెరుగుతోందని స్పష్టం అవుతోందని ఆయన నాయకత్వం, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ చర్యలు స్థానిక ప్రజాప్రతినిధులను ఆకర్షిస్తున్నాయి. పార్టీలో చేరిన అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ, రోహిత్ అభివృద్ధి దృష్టి, సామాజిక సేవా కార్యక్రమాలు తనను ప్రభావితం చేశాయని తెలిపారు. ప్రజల కోసం ఆయన చేస్తున్న కృషి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడించారు.

వరుసగా జరుగుతున్న మార్పులు, కాంగ్రెస్ వైపు పెరుగుతున్న మద్దతుతో మెదక్‌లో బీఆర్ఎస్ పార్టీ బలహీనపడుతున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా కూడా ఈ ప్రభావం కనిపించే అవకాశముందని భావిస్తున్నారు. ఇది రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక మలుపుగా మారిందన్నారు.

# జేమ్లా నాయక్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

-శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 22( మహాప్రభ )**
దేవరకొండ మండలం సూర్య తండా గ్రామపంచాయతీ మాన్య బావోజి తండా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్త నిన్న చనిపోయిన విషయం తెలుసుకొని వారి స్వగ్రామానికి వచ్చి నేనావత్ జేమ్లా నాయక్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేమ్లా నాయక్ ఈరోజు మన మధ్య లేకపోవడం కాంగ్రెస్ పార్టీకి మరియు గ్రామానికి తీరని లోటని అన్నారు..ఈ కార్యక్రమంలో సూర్య తండా సర్పంచ్ నేనావత్ కవిత - లచ్చిరాం, ఉపసర్పంచ్ కొర్ర రవీందర్, మాజీ సర్పంచ్ నేనావత్ నారాయణ, వార్డు మెంబర్లు దాస్య, జైపాల్, రాము మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం కొండగట్టులో ప్రత్యేక పూజలు



**కరీంనగర్ ఏప్రిల్ 22( మహాప్రభ )**
ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో వేల్పుల వెంకటేష్ నేతృత్వంలో ఆంజనేయ స్వామి ఆలయంలో తమలపాకులతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, రామ్ చరణ్ అభిమాన సంఘాల ఇన్‌చార్జ్‌లు కపిల్ మాధవ మిడిదొడ్డి, గాలిపెల్లి కుమార్, దిలీప్ రెడ్డి, అనిల్, నాగరాజ్, రాజేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని అభిమానులు ప్రార్థనలు చేశారు.

# బిజినెస్

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



భారత స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఇరాన్ తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ.. శాంతి చర్చల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు గరిష్ఠ స్థాయిలో క్రూడాయిల్ ధరలు కొనసాగుతుండటం, ఇటీవల లాభాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటివి కూడా ప్రభావం చూపాయి.ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేసింది. దాంతో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 79,019.34 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల బాటలోనే పయనించింది. ఇంట్రాడేలో 78,442.30 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 756.84 పాయింట్ల నష్టంతో 78,516.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 198.50 పాయింట్ల నష్టంతో 24,378.10 వద్ద ముగిసింది.డాలరుతో రూపాయి మారకం విలువ 37 పైసలు క్షీణించి 93.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 10 శాతం మేర నష్టపోయింది. ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, ఎటర్నల్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 99 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4,754 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## తగ్గిన గోల్డ్ రేట్స్..ఎంత తగ్గిందంటే?


ప్రపంచ వ్యాప్తంగా పసిడి, వెండి ధరల్లో హెచ్చు తగ్గులు ఉంటాయి. ఇక పండుగలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల్లో గోల్డ్, సిల్వర్ ఆభరణాలను ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. అంతర్జాతీయ పరిణామాల వలన ఈ బంగారం, వెండి ధరల్లో మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి. కొన్నిసార్లు రేట్స్ భారీగా తగ్గితే.. మరి కొన్నిసార్లు విపరీతంగా పెరుగుతుంటాయి. తాజాగా ఏప్రిల్ 22, బుధవారం బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ చదివి తెలుసుకుందాం.. 22 క్యారెట్ల బంగారం గ్రాము ధరలో నిన్నటితో పోల్చితే ఈ రోజు తగ్గాయో? పెరిగాయో ఇక్కడ చూద్దాం..

ఆంధ్రా, తెలంగాణలో గోల్డ్ రేట్స్ ఈ విధంగా ఉన్నాయి

**హైదరాబాద్‌లో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..**

8 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,060

22 క్యారెట్ల బంగారం 10 గ్రాములు ధర



రూ.1,41,850

24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు ధర రూ.1,54,750

**విజయవాడలో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..**

18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,060

22 క్యారెట్ల బంగారం 10 గ్రాములు ధర రూ.1,41,850

24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు ధర రూ.1,54,750

**ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో గోల్డ్ రేట్స్ పై ఓ లుక్కేద్దాం..**

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,900లు ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.1,42,000 గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం రూ.1,54,750లు ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,41,850 లు, చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,55,990లు, 22 క్యారెట్ల ధర రూ.1,42,990లు ఉంది. అలాగే, బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,750లు ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.141,850 లు ఉంది. కోల్‌కతా, పూణెలలో కూడా ఇవే ధరలు ఉన్నాయి. ఇక వెండి ధరల విషయాని కొస్తే.. వెండి కిలో రూ.2,65,000 లుగా కొనసాగుతోంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.2,74,900 లు, విశాఖపట్నంలో రూ.2,74,900 లు, చెన్నైలో రూ.77,000ల వద్ద కొనసాగుతోంది. బెంగళూరులో రూ.2,65,000 ముంబైలో 2,65,000లుగా ఉంది.

## అరబిందో రూ.800 కోట్ల బైబ్యాక్


న్యూఢిల్లీ

ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మా లిమిటెడ్ రూ.800 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేయబోతున్నట్టు ప్రకటించింది. ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న ఈ బైబ్యాక్ ప్రతిపాదన 29న ముగియనున్నదని పేర్కొంది. రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతి షేర్‌కు రూ.1,475 చొప్పున 54,23,728 ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేయబోతున్నట్టు ప్రకటించింది.ఇందుకోసం రూ.800 కోట్ల నిధులు వెచ్చించనున్నట్టు వెల్లడించింది. షేరు హోల్డర్లకు రాసిన లేఖలో..ఈ బైబ్యాక్ ప్రతిపాదనతో వాటాదారులకు ఆర్థిక లాభం చేకూరనున్నదన్నారు.




## ధోనీ రాకతో సీఎస్‌కే దశ మారుతుందా?

ఐపీఎల్ 2026 సీజన్ మొదలై అప్పుడే చెన్నై సూపర్ కింగ్స్ 6 మ్యాచ్‌లు ఆడేసింది. కానీ కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క రూపం మాత్రం ఇంకా మైదానంలో కనిపించలేదు. తనే.. మన తలా ఎంఎస్ ధోనీ. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ధోనీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ధోనీ రీఎంట్రీ పై క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా అయితే ఎంఎస్ ధోనీ నెట్స్‌లో వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అరుదు. ఆయన ఎక్కువగా బ్యాటింగ్ లేదా సరదాగా బౌలింగ్ చేస్తూ కనిపిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు ధోనీ వికెట్ కీపింగ్ గ్లోవ్స్ ధరించి ప్రాక్టీస్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబై మాజీ ప్లేయర్ ఆదిత్య తారే దీని మీద స్పందిస్తూ.. "నేను ధోనీని నెట్స్‌లో కీపింగ్ చేయడం ఎప్పుడూ చూడలేదు. ఇది నిజంగా షాకింగ్. బహుశా ఆయన తన మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించుకుంటున్నట్లు ఉన్నారు." అని పేర్కొన్నారు. ఇది సీఎస్‌కే శిబిరంలో గుడ్ సిగ్నల్స్ పంపుతోంది.




ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ కాఫ్ ఇంజూరీ (పిక్క గాయం) బారిన పడ్డారు. దీనివల్ల సీజన్ లో మొదటి 6 మ్యాచ్‌లకు ఆయన దూరమయ్యారు. ధోనీ లేకపోవడం వల్ల చెన్నై జట్టు 6 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. జట్టులో గేమ్ అవేర్‌నెస్ లోపించిందని, క్లిష్ట సమయాల్లో ధోనీ వంటి సీనియర్ అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఆయన ప్రాక్టీస్ మొదలుపెట్టడంతో, ఏప్రిల్ 23న ముంబైతో జరిగే మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గడిచిన రెండు సీజన్లలో ధోనీ లోయర్ ఆర్డర్ (నంబర్ 7 లేదా 8)లో వచ్చి మెరుపులు మెరిపించారు. 2024 ఐపీఎల్‌లో 161 పరుగులు చేసిన ఆయన, 2025 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 196 పరుగులు సాధించారు. స్ట్రైక్ రేట్ విషయంలో యువకుల కంటే బెటర్ గా ఉండటం ఆయన ప్రత్యేకత. ఈ ఏడాది కూడా అదే దూకుడును కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌పై ధోనీకి మంచి రికార్డు ఉండటం ప్లస్ పాయింట్.ఐపీఎల్‌లో ముంబై, చెన్నై మ్యాచ్ అంటేనే ఒక ఎల్ క్లాసికో. ఇరు జట్లు చెరో ఐదుసార్లు టైటిల్ గెలిచాయి. ప్రస్తుత పాయింట్ల పట్టికలో చెన్నై వెనుకబడి ఉన్న తరుణంలో, ధోనీ రాక జట్టులో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో ధోనీ సలహాలు జట్టుకు కొండంత బలాన్ని ఇస్తాయి. రేపటి మ్యాచ్‌లో ధోనీ టాస్ సమయానికి జట్టులో ఉంటారా లేదా అన్నదే ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న.

## ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలి

### టీమిండియా మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్


పాట్ కమిన్స్ వచ్చినా ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్‌కు టీమిండియా మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సంజయ్ బంగర్ సూచించారు. ఇషాన్ సారథ్యంలో జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తుందని, ఆ మూమెంటమ్‌ను దెబ్బతీయవద్దని కోరారు. వెన్ను గాయంతో పాట్ కమిన్స్ ఐపీఎల్ ఫస్టాఫ్ మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. గాయం నుంచి కోలుకున్న కమిన్స్.. జట్టుతో కలిసాడు. శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్ వేదికగా జరిగే తమ తదుపరి మ్యాచ్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. కమిన్స్ రాకతో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ మార్పు జరుగుతుందా? లేదా? అనే సస్పెన్స్ నెలకొంది. ఈ వ్యవహారంపై జియో హాట్‌స్టార్ షోలో హర్భజన్ సింగ్, టీమిండియా మాజీ కోచ్ సంజయ్ బంగర్ మాట్లాడారు. ఈ ఇద్దరూ ఇషన్ కిషన్‌నే సారథిగా కొనసాగించాలని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్‌కు సూచించారు. 'పాట్ కమిన్స్ తిరిగి వచ్చినా సరే.. ఇషాన్ కిషనే సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా కొనసాగించాలి. ఈ నిర్ణయం చర్చనీయాంశం



కావచ్చు. కానీ జట్టు ఒక యువ నాయకుడికి మద్దతు ఇచ్చినప్పుడు.. అతనితోనే ముందుకు సాగాలి.బౌలర్లు, ఇతర ఆటగాళ్లు ఇషాన్ కిషన్‌తో మంచి సమన్వయాన్ని పెంచుకున్నాడు. ఇషాన్ కిషన్‌ను కెప్టెన్‌గా కొనసాగించడం వల్ల సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రయోజనం చేకూరుతుంది.'అని హర్భజన్ సింగ్ అభిప్రాయపడ్డాడు.కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడని, కమిన్స్ రాకతో అతన్ని పక్కనపెడితే టీమ్ మూమెంటమ్ దెబ్బతింటుందని సంజయ్ బంగర్ హెచ్చరించాడు. 'సారథిగా ఇషాన్ కిషన్ తన బౌలర్లను సమర్థవంతంగా ఉపయోగించకుంటున్నాడు. ఏ బ్యాటర్ మీద ఏ బౌలర్‌ను ఉపయోగించాలనే విషయంలో అతనికి స్పష్టమైన అవగాహన ఉంది. ఇది అతను ఆటను ఎంత బాగా నియంత్రిస్తున్నాడో చెప్పడానికి ఒక నిదర్శనం.తీవ్ర ఒత్తిడిలో కూడా ఇషాన్ కిషన్ ఎలాంటి గందరగోళానికి గురికాకుండా.. తొందరపడకుండా మైదానంలో సరైన నిర్ణయాలు తీసుకుంటున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో స్పిన్నర్లను ఉపయోగించిన తీరు అద్భుతం. పాట్ కమిన్స్ ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకున్నాడు. అతను ఏ మేరకు రాణిస్తాడో చెప్పలేం. సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ కూడా ఇషాన్ కిషన్‌నే కొనసాగించాలనే యోచనలో ఉండవచ్చు.'అని సంజయ్ బంగర్ అభిప్రాయపడ్డాడు. మెజార్టీ అభిమానులు కూడా ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని కోరుకుంటున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు మీద ఉంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానంలో కొనసాగుతోంది.

# స్పోర్ట్స్

## అభిషేక్ చిరస్మరణీయ ఇన్నింగ్స్



ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అభిషేక్ శర్మ అదరగొట్టాడు. ఢిల్లీ బౌలర్లను ఊచకోత కోస్తూ చిరస్మరణీయ ఇన్నింగ్స్‌ను ఆడాడు. 47 బంతుల్లోనే సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 68 బంతుల్లో 135 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 10 సిక్సర్లు ఉన్నాయి. ఈ క్రమంలోనే పలు రికార్డులను అందుకున్నాడు. 50 బంతుల్లోపు రెండు ఐపీఎల్ సెంచరీలను సాధించిన తొలి భారత క్రికెటర్‌గా అభిషేక్ శర్మ రికార్డు సృష్టించాడు. అభిషేక్ 2025 ఐపీఎల్‌లో పంజాబ్‌పై 40 బంతుల్లోనే శతకాన్ని సాధించాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారతీయ ప్లేయర్‌గా విరాట్ కోహ్లితో కలిసి సంయుక్తంగా నిలిచాడు. ఈ క్రమంలో అతడు రోహిత్ శర్మను అధిగమించాడు. టీ20ల్లో ఇప్పటి వరకు అభిషేక్ శర్మ 9 సెంచరీలు చేశాడు. ఇందులో ఐపీఎల్‌లో రెండు, టీమిండియా తరుపున రెండు సెంచరీలు ఉండగా.. మిగిలినవి దేశవాళీ టీ20 క్రికెట్‌లో చేశాడు. ఇక టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో అభిషేక్ శర్మ చోటు సంపాదించుకున్నాడు. ఈ జాబితాలో నాలుగో స్థానంలో అభిషేక్ శర్మ ఉండగా.. 22 సెంచరీలతో ఈ జాబితాలో క్రిస్‌గేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఓ టీ20 ఇన్నింగ్స్‌లో 10 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లను అభిషేక్ శర్మ 5 సార్లు నమోదు చేశాడు. ఈ జాబితాలో క్రిస్‌గేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. 18 సార్లు అతడు ఈ ఘనతను సాధించాడు. శ్రేయస్ అయ్యర్, ఎవిన్ లూయిస్‌లు చెరో నాలుగు సార్లు ఈ ఘనతను నమోదు చేశారు. అభిషేక్ శర్మ చేసిన స్కోరు ఐపీఎల్‌లో ఐదో వ్యక్తిగత అత్యధిక స్కోరుగా నిలిచింది. 175 పరుగులతో క్రిస్‌గేల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా 158 పరుగులతో బ్రెండన్ మెక్‌కల్లమ్ రెండో స్థానంలో నిలిచాడు.



## గ్లామర్ డోస్ పెంచిన ఆషికా..

# సిటాడెల్–2 సీజన్‌లో ప్రియాంక చోప్రా



గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ మాడెన్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ సిరీస్ 'సిటాడెల్' రెండో సీజన్‌కు సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను విడుదల చేస్తూ.. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్ట్రీమింగ్ తేదీని ప్రకటించింది. ఈ సిరీస్‌ను మే 6 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రాబోతోంది. ఈ రెండో సీజన్ ట్రైలర్ గమనిస్తే.. ఫస్ట్ పార్ట్ కంటే ఇందులో మరింత యాక్షన్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. నాడియా సిన్ (ప్రియాంక), మేసన్ కేన్ (రిచర్డ్) మరియు బెర్నార్డ్ ఓర్లిక్ (స్టాన్లీ టుచి) తమ గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూనే, సిటాడెల్ సంస్థను నాశనం చేసిన క్రూరమైన 'మాంటికోర్' నెట్‌వర్క్ నుంచి ప్రపంచాన్ని రక్షించే భారీ మిషన్‌లో తలపడబోతున్నారు. హాలీవుడ్ ప్రముఖులు జాక్ రేనర్, మ్యాట్ బెర్రీ వంటి వారు కొత్తగా ఈ సీజన్‌లో భాగం కాగా, రూసో బ్రదర్స్ నిర్మాణ విలువలు ఈ సిరీస్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ప్రస్తుతం రాజమౌళి ? మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా షూటింగ్‌లో ప్రియాంక చోప్రా బిజీగా ఉన్నప్పటికీ, ఆమె తన గ్లోబల్ ప్రాజెక్ట్ 'సిటాడెల్'తో అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటడానికి సిద్ధమైంది.

# చిరుతో బాబీ సినిమా నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి




టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.

# 'పెద్ది'లో శృతి హాసన్ స్పెషల్ సాంగ్

## గ్లామర్‌తో పాటు డ్యాన్స్‌తోను ఇక విధ్వంసమే..!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'కి సంబంధించిన తాజా అప్‌డేట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినా... చివరకు ఈ అవకాశాన్ని శృతి హాసన్ దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ త్వరలోనే ప్రారంభమై, తక్కువ సమయంలో పూర్తయ్యేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు హైలైట్‌గా నిలిచే ఈ పాటలో శృతి హాసన్ గ్లామర్, స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక శృతి హాసన్కు స్పెషల్ సాంగ్స్ కొత్తేమీ కాదు. గతంలోనే రామ్ చరణ్‌తో కలిసి 'ఎవడు' సినిమాలో 'పింపుల్ డింపుల్' పాటలో సందడి చేసిన విషయం తెలిసిందే. అలాగే మహేశ్ బాబు నటించిన 'ఆగడు' సినిమాలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో మెరిసి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'పెద్ది'లో మరోసారి స్పెషల్ సాంగ్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఈ సినిమా పై భారీ అంచనాలు ఉండగా... శృతి హాసన్ ఎంట్రీతో మరింత హైప్ పెరిగే అవకాశముంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 'పెద్ది' సినిమా నుంచి త్వరలోనే ఈ స్పెషల్ సాంగ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ పాట ఎలా ఉండబోతుందో... శృతి హాసన్ ఏ రేంజ్‌లో ఆకట్టుకుంటుందో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె తెలుగులో చేస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది. మరో ప్రత్యేకత ఏమిటంటే... ఈ చిత్రానికి సంగీతం ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఆయన స్వరపరిచే పాటలు, ముఖ్యంగా ఈ స్పెషల్ సాంగ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. మొత్తానికి 'పెద్ది'లో శృతి హాసన్ ఎంట్రీతో సినిమాపై హైప్ మరింత పెరిగింది.




# నీకెంత.. నాకెంత?..

## ఆకట్టుకుంటున్న 'ఎంఆర్‌పీ' టీజర్!

టాలీవుడ్ నటులు నరేశ్ అగస్త్య, వెన్నెల కిశోర్ ప్రధాన పాత్రల్లో శ్రవణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎంఆర్‌పీ' (వీ·ఆా). 'నీకెంత, నాకెంత' అనే ఆసక్తికరమైన ఉపశీర్షికతో ఈ సినిమా రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. 'మన కల కోసం మనం పనిచేయకపోతే.. వేరే వాళ్ల కలల కోసం మనం పనిచేయాల్సి ఉంటుంది' అనే డైలాగుతో ప్రారంభమైన ఈ టీజర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి, బిగ్ బాస్ ఫేమ్ డోనాల్ బిష్ట్ టాలీవుడ్‌లోకి కథానాయికగా అడుగుపెడుతున్నారు. ఈ టీజర్‌ను గమనిస్తే, మధ్యతరగతి యువత కలలు, నేటి సమాజంలో ఆర్థిక సంబంధాల చుట్టూ సాగే ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ కథాంశంతో ఈ సినిమా రూపుదిద్దుకున్నట్లు తెలుస్తుంది. గతంలో 'మత్తు వదలరా' 'స గుర్రం పాపి రెడ్డి' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నరేశ్ అగస్త్య మరో ఆసక్తికర పాత్రలో కనిపిస్తుండగా, వెన్నెల కిశోర్ తనదైన శైలిలో వినోదాన్ని పంచేందుకు సిద్ధమయ్యారు. ఎం.ఎస్.ఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం కామెడీ మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌తో కూడిన పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com